క్లుప్తంగా

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



గుడివాడరూరల్: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం మండలంలోని రౌడీషీటర్లకు గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎస్.చంటిబాబు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లు, చెడునడత ఉన్న వ్యక్తులు నేరాలను వదిలి స్వేచ్ఛగా జీవించాలన్నారు. దొంగతనాలు, గొడవలు, అక్రమ మద్యం, మాదకద్రవ్యాల అమ్మకాలు, కోతముక్క, కోడి పందాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు. అనుమానిత వ్యక్తులపై పోలీసుల నిఘా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్‌ఐ లోకేశ్వరి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన



గుడివాడ టౌన్: స్థానిక 31వ వార్డు రైల్వేస్టేషన్ రోడ్డులో ఆదివారం భారీ అన్నసమారాధన జరిగింది. వార్డుకు చెందిన శ్రీ కనకదుర్గమ్మ భక్త బృందం ఆధ్వర్యంలో జరిగిన శ్రీ దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు ముగిసిన సందర్భంగా శాంతి నిమిత్తం అన్నసమారాధన నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ది గుడివాడ అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జి) అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో బొంబాయి శ్రీను, వెంకట్రావు, సీహెచ్ ప్రసాద్, సీహెచ్ నాని, వెంకట్రావు, శౌరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గుత్తా రమేష్‌కు నివాళి



గుడివాడ టౌన్: మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఏర్పాటు చేసి దానికి గుర్తింపు తెచ్చిన సేవా తత్పరులు గుత్తా రమేష్ అని మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు కొనియాడారు. ఆదివారం స్థానిక ఐఎంఏ హాలులో గుత్తా రమేష్ సంస్మరణ సభ జరిగింది. గుత్తా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాశాఖాధికారిగా పెదపారుపూడి మండలంలో మూడేళ్లపాటు పనిచేసి ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారన్నారు. గుత్తా రమేష్‌కు ఏఎన్నార్ కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి, జిల్లా చైర్మన్ పి.వి. శేషగిరిరావు, మారుతీ ప్రసాద్, సభ్యులు జయలక్ష్మి, పావులూరి శ్రీనివాసరావు, సీహెచ్ సత్యన్నారాయణ, కోనా రామారావు, జి. చంద్రశేఖర్, పి.ఎస్.వి. ప్రసాదు తదితరులు నివాళులర్పించారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన



పమిడిముక్కల: మండలంలోని లంకపల్లి గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పర్యటించి జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామానికి చెందిన దోనేపూడి వెంకటేశ్వరరావుకు రూ.1.85 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఘంటా సురేష్, నాదెళ్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా డ్రెయిన్ వ్యవస్థ

- చిన్నపాటి వర్షానికే రహదార్లు జలమయం
- డ్రెయిన్ల నిర్వహణను పట్టించుకోని అధికారులు



దిగువకు ప్రవహించక నిలిచిపోయిన మురుగు



పామర్రు - గుడివాడ రహదారి పక్కన గుర్రపు డెక్కతో నిండిపోయిన డ్రెయిన్



గట్లు ఆక్రమణలకు గురై కుచించుకుపోయిన డ్రెయిన్

పామర్రు: మురుగునీటి డ్రెయిన్ల నిర్వహణపై పామర్రు పంచాయతీలో పాలకులు, అధికారుల మధ్య సమన్వయ లోపం, చిత్తశుద్ధి లేమి కారణంగా గ్రామంలో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతోంది. దీంతో గ్రామంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొని పలు చోట్ల చిన్నపాటి వర్షానికే నీరు రోడ్లపైకి చేరి ప్రయాణికులను, స్థానికులను అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి.

పామర్రు పంచాయతీ పరిధిలో 20 వార్డులు ఉండగా వాటిలో 9,200 గృహాలు, సుమారు 28వేల జనాభా ఉన్నారు. ఏడాదికి రూ.2.5కోట్ల వార్షిక ఆదాయం వస్తోంది. అయినా గాంధీనగర్, చాట్లవానిపురం, వీరాంజనేయపురం, కొరముక్కువానిపురం, శ్యామలాపురం, కూర్మాపురం, చెన్నువానిపురం, కంచర్లవాని పురం, అరండాల్‌పేట, కోటిరెడ్డి పేటలలో మురుగునీరు సక్రమంగా ప్రవహించక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ప్రధానంగా 126 కచ్చా డ్రెయిన్లు, 39 పక్కా డ్రెయిన్లు, సీసీ డ్రెయిన్లు ఉన్నాయి.

కుచించుకుపోయిన డ్రెయిన్లు

గ్రామంలోని మురుగునీరు బయటకు పోయేందుకు మూడు మాస్టర్ డ్రెయిన్లను ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ సక్రమంగా లేని కారణంగా అవి కుచించుకుపోయి నామ రూపాల్లేకుండా పోతున్నాయి. గుడివాడ రోడ్డులోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి చాట్లవానిపురం వరకు పామర్రు మురుగు డ్రెయిన్ ప్రవహించి లంక కాలువలో కలుస్తుంది. దీని నిర్వహణ సక్రమంగా లేని కారణంగా డ్రెయిన్ అంతా గుర్రపు డెక్క, నాచు, తూడుకాడలతో నిండిపోయింది. అంతే కాకుండా ఈ డ్రెయిన్ పక్కనే పామర్రు - దిగమర్రు జాతీయ రహదారి ఏర్పాటు చేయడంతో డ్రెయిన్ సగానికి కుచించుకుపోయింది. డ్రెయిన్ ఈ విధంగా సగానికి తగ్గిపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు.

- స్థానిక నాలుగురోడ్ల కూడలి నుంచి చల్లపల్లి వెళ్లే రహదారిలో ఉన్న మరో డ్రెయిన్ స్థానిక అరండాల్‌పేట, కోటిరెడ్డిపేట, కూడలి ప్రాంతాల్లోని ప్రజలు వాడిన మురుగునీటి ని తీసుకుని ఉరుటూరు మీదుగా ప్రయాణించి ఐనంపూడి డ్రెయిన్‌లో కలుస్తుంది. పామర్రు డ్రెయిన్ గట్లు ఆక్రమణకు గురికావడమే కాకుండా డ్రెయిన్‌లో గుర్రపుడెక్క, ముళ్ల కంపలతో నిండిపోయి, మురుగునీరు దిగువకు ప్రవహించే పరిస్థితి లేదు.
- పామర్రు - విజయవాడ జాతీయ రహదారిలో స్థానిక కూడలి వద్ద నుంచి పోలీస్ స్టేషన్, వాణిసదన్, కొతిబొమ్మడొంక మీదుగా వీరాంజనేయ కాలనీల మీదుగా కోతిబొమ్మ డొంక డ్రెయిన్ ప్రవహిస్తూ అక్కడి మురుగునీటిని తీసుకుని పామర్రు ఛానల్‌కు చేరుకోవాలి. కానీ ఈ డ్రెయిన్‌లో మట్టి పూడికతో, పిచ్చి కంప ఉండటంతో నీరు సక్రమంగా ప్రవహించడం లేదు. ఈ డ్రెయిన్ల నిర్వహణ సంబంధిత శాఖ ద్వారా జరగాల్సి ఉండగా అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

గ్రామంలో నిధుల వెసులుబాటుని బట్టి డ్రెయిన్ల అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుంది. గ్రామంలోని కొన్ని డ్రెయిన్లలో మురుగు నీరు సక్రమంగా ప్రవహించడంలేని కారణంగా వాటి అభివృద్ధికి పంచాయతీ ఆధ్వర్యంలో పనులను త్వరితగతిన నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

– సలీం, గ్రామ కార్యదర్శి

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



బొమ్మినంపాడు హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు

ముదినేపల్లి రూరల్: మండలంలోని బొమ్మినంపాడు హైస్కూల్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా హైస్కూల్‌కు చెందిన 1998-99 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు నాటి గురువులను సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనాటి జ్ఞాపకాలను నెమరవేసుకుని, ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకొన్నారు. రోజంతా ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో కొరగుంటపాలెం సర్పంచ్ పేరే రామకృష్ణ, ఎర్రంశెట్టి భరత్‌కుమార్, రామాంజనేయులు, అచ్చుత ప్రశాంత్‌కుమార్ తదితర మొత్తం 64 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్టీఐ ఆవిర్భావ దినోత్సవం



సమావేశంలో పలు సంస్థల ప్రతినిధులు

గన్నవరం: స్థానిక విశ్వభారతి సైనిక్ స్కూల్ ఆవరణలోని మన హక్కుల కోసం పోరాడు - సాధించు ఉద్యమ సంస్థ కార్యాలయంలో ఆదివారం సమాచారం హక్కు చట్టం-2005(ఆర్టీఐ) ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వలంటరీ ఆర్గనైజేషన్, యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యంకి సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో పౌర సేవలు పొందడానికి, పాలనలో పారదర్శకతను తీసుకురావడంలో సమాచార హక్కు చట్టం కీలకంగా మారిందన్నారు. ఈ చట్టంపై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. యూఎఫ్ఐ ఆర్టీఐ రాష్ట్ర అధ్యక్షుడు జంపాన శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పాలకులు, అధికారులను ప్రజలు ప్రశ్నించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ చట్టం వల్ల సేకరించిన సమాచారం ద్వారా లోకాయుక్త, కోర్టులను ఆశ్రయించి అనేక విజయాలు సాధించినట్లు గుర్తుచేశారు. పౌర సమాజం ఐక్య వేదిక అధ్యక్షుడు కురగంటి హనుమంతరావు, ఐఏఏవీఓ రాష్ట్ర చైర్మన్ సయ్యద్ లాల్ సాహెబ్, సామాజిక కార్యకర్తలు బేతపూడి జోగేశ్వరరావు, డాక్టర్ కొత్తపల్లి సత్యం నారాయణ, సీహెచ్. హేమలత, కోట కెంపురాజు, ఇటుకల నాగరాజు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు



మచిలీపట్నంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ భానుమూర్తి

మచిలీపట్నంటౌన్: విజ్ఞానవేత్త, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక సన్ స్టార్ స్కూల్ ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. హ్యూమానిటీ ఫౌండేషన్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న 200 మందికి స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నేత్ర వైద్య నిపుణుడు, జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ జీ భానుమూర్తి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. కంటికి శస్త్రచికిత్స అవసరమైనవారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు డాక్టర్ భానుమూర్తి తెలిపారు. చిన్నారి హర్షవర్ధన్‌కు వైద్య చికిత్స నిమిత్తం రూ.10 వేలను మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు శ్రీరామ్ అందజేశారు. ఈ కార్యక్రమాన్ని హ్యూమానిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నూర్జహాన్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కృష్ణా జిల్లా విద్యానిధి కన్వీనర్ పి.శ్రీరామ్, కృష్ణా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సల్మాబేగం సేవా సంస్థ ప్రెసిడెంట్ జీ కిషోర్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ బొమ్మిడి అయ్యప్ప స్వామి, సభ్యులు అజమతున్నిసా, హుస్సేన్, స్టార్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.ఎల్ ఆదిత్య పర్యవేక్షించారు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

ముదినేపల్లి రూరల్: కుమార్తె అదృశ్యంపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని వణుదుర్రుకు చెందిన మహిళ ఆదివారం ఉదయం నిద్ర లేచి చూసే సరికి తన కుమార్తె అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బంటుమిల్లి మండలం మల్లేశ్వరంకు చెందిన ఓ యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదులో పేర్కొనగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

గుడివాడరూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎస్.చంటిబాబు పేర్కొన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుని వ్యాధుల బారిన పడకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన

పామర్రు: మొవ్వ గ్రామంలోని మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నుంచి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వరకు శాంతియుతంగా వెళ్లి నిరసన తెలియజేసి వినతిపత్రం అందజేయడం జరుగుతుందని పామర్రు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వ నేతల కనుసన్నల్లో జరుగుతున్న కల్తీ మద్యం తయారీకి వ్యతిరేకంగా సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కైలే కోరారు.

ఉత్తమ రైతులకు సత్కారం



పామర్రు: రైతుల దినోత్సవం సందర్భంగా పామర్రు సెంటర్‌లో ఘంటసాల కళాపీఠం ఆధ్వర్యాన ఆదివారం పలువురు రైతులను సత్కరించారు. కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ మాట్లాడుతూ రైతు లేనిదే రాజ్యం లేదని పేర్కొన్నారు. రైతులు కష్టపడి పండిస్తే వాటిని మనం అందరం అనుభవిస్తున్నామని అన్నారు. అనంతరం కళాపీఠం ఆధ్వర్యంలో పామర్రు మండలంలోని ఆరుగురు ఉత్తమ రైతులను సన్మానించారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు భీమవరపు శ్రీనివాసరెడ్డి, కళాపీఠం కార్యదర్శి నందిపాటి హేమంత్‌రెడ్డి, సభ్యులు సల్మాన్ కొల్లాబత్తుల కొండ తదితరులు పాల్గొన్నారు.

కొండలమ్మ సన్నిధిలో భక్తుల కోలాహలం



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధి ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తులు పాల పొంగళ్లు పొంగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను దేవస్థాన చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు పర్యవేక్షించారు.

అమ్మవారిని దర్శించుకున్న సినీ నిర్మాత అమర్

మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని చిరంజీవి క్రియేషన్స్ అధినేత, ధర్మ కార్య సంస్థ ప్రతినిధి చల్లపల్లి అమర్ ప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయాధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు అమర్‌ను శేష వస్త్రంతో సన్మానించి.. అమ్మవారి లడ్డూ ప్రసాదాలను అందజేశారు.



కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం

నందివాడ: పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకే రాష్ట్రంలోని 17 మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వంటి దుర్మార్గ చర్యలకు సీఎం చంద్రబాబు పూనుకున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ పేర్కొన్నారు. నందివాడలోని స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ వాల్ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శశిభూషణ్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో కూటమి శ్రేణులకు లాభం చేకూర్చాలన్నదే చంద్రబాబు ఆలోచన అని విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజాఉద్యమం చేపట్టి సమస్యను గవర్నర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టి అందులో ఐదు కళాశాలలు పూర్తి చేశామని గుర్తుచేశారు. మరో మూడు కళాశాలల పనులు తుదిదశకు చేరుకున్నాయని వివరించారు. ఈ మెడికల్ కాలేజీల పనులను పూర్తి చేస్తే ఎక్కడ జగనన్నకు మంచి పేరు వస్తుందోనని భయంతోనే చంద్రబాబు ప్రైవేటీకరణకు తెరలేపారని మండిపడ్డారు. పేద విద్యార్థులకు వైద్య విద్య అందించడం ఇష్టం లేకనే కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పూర్తి చేయకుండా కుట్ర పన్నుతున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఉచిత వైద్యం అందాలంటే ప్రభుత్వ మెడికల్ కాలేజీల అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పునరాలోచించి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరణ

కూటమి చర్యలు ఎండగట్టాలి

ప్రభుత్వ మెడికల్ కాలేజీల పరిరక్షణ ఉద్యమంలో భాగంగా ఈనెల 28వ తేదీన నియోజకవర్గ కేంద్రాల్లో, నవంబరు 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిస్తామని శశిభూషణ్ తెలిపారు. ఆయా ర్యాలీల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలంతా పాల్గొని కూటమి ప్రభుత్వ చర్యలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర గ్రీవెన్స్ సెక్రటరీ దేశిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, కృష్ణాజిల్లా జనరల్ సెక్రటరీ కందుల నాగరాజు, ఎంపీపీ పెయ్యల ఆదాము, వైస్ ఎంపీపీ పూడిక సుధాకర్, తోట నాగరాజు, రంగారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జగదీష, చంద్రశేఖర్, నాగేశ్వరరావు, సుందర్‌రావు, కోటి, లాజర్, అశోక్, అబ్రహం, నాగూర్ సాగర్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వాలో యాజమాన్య పద్ధతులు అద్భుతం



ఆటపాక చేపల చెరువు వద్ద వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

కైకలూరు: కొల్లేరు పరిసర ప్రాంతాల్లో రైతులు ఆచరిస్తున్న ఆక్వా సాగు యాజమాన్య పద్ధతులు అద్భుతంగా ఉన్నాయని నెల్లూరు జిల్లా, ముత్తుకూరు మత్స్య కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. క్షేత్ర స్థాయి సాగు పరిశీలనలో భాగంగా 40 మంది విద్యార్థులు కొల్లేరు పరిసర ప్రాంతాల్లో ఆదివారం పర్యటించారు. ఆక్వా మేతల కర్మాగారాలు, ప్రాసెసింగ్ ప్లాంట్లు, కొల్లేరు సంప్రదాయ చేపల వేట పద్ధతులు, సాగులో యాజమాన్య మెలకువలను అధ్యయనం చేశారు. ఆటపాకలో రైతు శ్రీనివాసరాజు చేపల చెరువును సందర్శించి పంట సమయం, చేప విత్తనం, సాగులో ఎదురయ్యే వ్యాధులు, నివారణ పద్ధతులు, పెట్టుబడి, ఖర్చు వంటి విషయాలను తెలుసుకున్నారు. స్థానిక మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సి.హెచ్.గణపతి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఇసుక కోడు వంతెన



ప్రమాదకరంగా ఉన్న ఇసుక కోడు డ్రెయిన్ వంతెన

మండవల్లి: మండలంలోని ఇంగిలిపాకలంక వద్ద ఇసుక కోడు డ్రెయిన్ వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెన అడుగు భాగం, రెయిలింగ్ పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ వంతెనపై నుంచి ఇంగిలిపాకలంక మీదుగా పెనుమాకలంక, నందిగామ లంక తదితర లంక గ్రామాలకు నిత్యం చేపల, రొయ్యల మేతల లోడ్ లారీలు వెళ్తుంటాయి. ఇది నిర్మించి సుమారు 40 ఏళ్లు అయ్యింది. ఈ డ్రెయిన్ నుచ్చుమిల్లి, పులపర్రు మీదుగా కొల్లేటిలో కలుస్తుంది. లోడ్ లారీలు వెళ్లేటప్పుడు మరింత ప్రమాదకరంగా ఉండి ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శ్యామలాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

కైకలూరు: స్థానిక శ్యామలాంబ దేవస్థానంలో చండీ మహాయాగ సహిత శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఇటీవల అత్యంత వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి దేవస్థాన ఆవరణలో భారీ అన్నసమారాధనను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ పాల్గొన్నారు.

వినాయకుడి విగ్రహం పునఃప్రతిష్ఠ

మండవల్లి: మండలంలోని లింగాలలో ఆదివారం వినాయకుని విగ్రహాన్ని పునఃప్రతిష్ఠ నిర్వహించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు బోయిడి సురేష్ దంపతులు పీటల మీద కూర్చుని పూజా క్రతువులు నిర్వహించారు.

అర్చకుడి గృహానికి రూ.17 లక్షల విరాళం

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదపాలపర్రు శ్రీ గంగా సమేత మల్లేశ్వరస్వామి ఆలయ అర్చకుడు గృహ నిర్మాణానికి దాతలు రూ.17 లక్షలు విరాళం అందించగా, నిర్మాణం పూర్తి చేసుకుని ఆదివారం గృహప్రవేశం చేశారు. గ్రామానికి చెందిన పిన్నిమనేని హరిరామకృష్ణ ప్రసాద్, దయాల్ ప్యారీ దంపతులు తమ తల్లిదండ్రులు భాస్కరరావు, సీతారావమ్మ జ్ఞాపకార్థం రూ.17లక్షలు విరాళం అందజేశారు.

సరిహద్దు వివాదంపై కేసు నమోదు

ముదినేపల్లి రూరల్: సరిహద్దు గొడవకు సంబంధించి స్థానిక పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పెదపాలపర్రుకు చెందిన కొడాలి రమేష్‌కు, కొడాలి శోభానాద్రికి ఇంటి సరిహద్దుల మధ్య కొంత కాలంగా వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో శోభనాద్రి మరో నలుగురు వ్యక్తులతో వచ్చి తనతో పాటు తన భార్యను దుర్భాషలాడి దాడి చేసినట్లు రమేష్ ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సైకిలిస్టును ఢీకొన్న కారు

పెడన: సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనుకగా వచ్చిన కారు ఢీ కొనడంతో ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటనపై పెడన పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెడన పట్టణంలోని 18వ వార్డుకు చెందిన ఎం.వీరభద్రరరావు (68) శనివారం రాత్రి మచిలీపట్నం నుంచి పెడన తోటమూలకు వచ్చే బైపాస్ రోడ్డు వెంబడి కాలకృత్యాల కోసం సైకిల్‌పై వస్తున్నాడు. అదే సమయంలో మచిలీపట్నం నుంచి బంటుమిల్లి వైపుగా వెళ్తున్న కారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనుకగా ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన వీరభద్రరరావును స్థానికంగా ఆసుపత్రికి తీసుకువెళ్లగా వారు మచిలీపట్నం తీసుకువెళ్లాలని సూచించారు. మచిలీపట్నం వెళ్లి చికిత్స పొందుతున్న వీరభద్రరరావును మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెడన ట్రైనీ ఎస్‌ఐ ఎం.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.